**కామెడీ కథ**

**సినిమా వదలడానికి ఇంకా ఐదు నిముషాలు ఉందనగా థియేటర్ ఎగ్జిట్ ద్వారాల దగ్గర కలకలం మొదలైంది.**

**"ఇది నా ప్లేస్"**

**"ఇక్కడికి నేను ముందొచ్చాను"**

**"మీరు కాస్త అటువైపు జరగండి"**

**"ఇదేమన్నా మీ తాతజాగీరా...అటువెళ్లండి ఈ ప్లేస్ నాది అనడానికి"**

''అబ్బ గొర్రెల మందల్లా ఏంటయ్యా ఒకళ్ళ మీద ఒకళ్ళు పడిపోతున్నారు. అక్కడ ఎంట్రెన్స్ లోనూ మనుష్యలని అదుపులో పెట్టాలి. ఇటు ఎగ్జిట్‌లోనూ కంట్రోల్ చేయాల్సి వస్తోంది. అంతా మా ఖర్మ'' తమ పొజిషన్లు సరిచేసుకుని థియేటర్ నుంచి బయటకి వచ్చే 'బకరా'ల కోసం




ఎదురుచూస్తున్న ఛానెళ్ల వాళ్ళని అదిలించాడో పోలీసు.

''సినిమా చూసినవాళ్ళు బయటికి రాక ఛస్తారా? కాస్త ఓపిక పట్టండయ్యా ఎందుకంత కంగారు'' కానిస్టేబుల్ నిదానరావు అందరికీ సర్దిచెబుతున్నాడు. ఇంతలో మూసిన తలుపులు బార్లా తెరుచుకున్నాయి. బయటికి పాలోమంటూ మనుషులు వస్తున్నారు. అందరి కెమేరాలు ఫ్లాష్‌లు మెరిపిస్తున్నాయి. ఒక్క సెకనునే అక్కడ చేరిన అనంతమైన టీవీ ఛానెళ్ళ వాళ్ళ నోళ్ళు తెరుచుకున్నాయి. కెమేరాలు ఆఫ్ అయ్యాయి. ఇదేంటి లైన్‌గా ఇన్ని బురఖాలు.

''సినిమా ఎలా ఉంది?''

''ఆడుతుందా?''

''బికినీలో హీరోయిన్ అందాలు ఎలా ఉన్నాయి?''

''పాటలు ఎలా ఉన్నాయి?''

''వానపాటల్లో శృంగారం శ్రుతిమించిందా?''

''పిక్చర్ నడుస్తుందా? పరిగెడుతుందా?''

''కొత్త హీరోయిన్‌కి ఇంకో సినిమా ఛాన్స్ వస్తుందా?'' లాంటి చెత్త ప్రశ్నలు లైన్‌గా దొరికిన వాళ్ళమీద సంధించాలనుకుంటున్నవాళ్ళ నోళ్ళు అలా తెరుచుకునే ఉండిపోయాయి.

ఇది మహిళా చిత్రం కాదు. మరిన్ని బురఖాలేంటబ్బా? అని తల గోక్కుంటుండగానే తలమీద ముసుగులతో మరికొంతమంది బయటికి వచ్చారు. మేలిముసుగులో ఉన్నవాళ్ళు ఎండ కన్నెరగని కన్నెలూ కాదు... అతివలూ కాదు. జీన్స్ ప్యాంట్-డార్క్ రంగు షర్టుల్లో ఉన్న కాలేజీ కుర్రకారు, యువకులు. కొంతమంది పెద్దవాళ్ళు తువ్వాళ్ళు, అంగవస్త్రాలు మొహం కనపడకుండా కప్పుకుని వస్తున్నారు. ఆడవాళ్ళు కొంగులు, చున్నీలు కప్పుకుని మొహం చాటేస్తున్నారు. ఈ వింత దృశ్యం చూస్తూ విలేఖరులు తెరిచిన నోళ్ళు మూసుకోవాలన్న ధ్యాసే లేకుండా ఉండిపోయారు. వాళ్ళ మతి పూర్తిగా భ్రమించలేదనడానికి నిదర్శనంగా ''అటుచూడండి'' అంటూనే ఓ యాంకర్ గట్టిగా అరిచాడు.

అటువైపు కళ్ళు తిప్పిన ఛానెళ్ల వాళ్ల మతులు మరోసారి భ్రమించాయి. మొదట్లో హాల్లోంచి బయటికి వచ్చిన బురఖా వాళ్లందరూ బురఖా తీసేసి నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నారు. వాళ్లందరూ అచ్చం మగాళ్ళు...గడ్డం...మీసం ఉన్నవాళ్ళే. కాకపోతే వయసులో తేడా.

'క్షణమొక గండం' సినిమా మొదటిరోజు మొదటి ఆటకి వచ్చిన ప్రేక్షకుల అభిప్రాయం తెలుసుకుని తమ తమ ఛానెళ్ళలో ప్రసారం చేసి ఇక్కడ సినిమాకొచ్చినవాళ్ళ బుర్రతోపాటు అక్కడ టీవీ ముందర కూర్చునేవాళ్ళ బుర్ర కూడా పరాపరా తినేద్దామనుకున్నవాళ్ళకి ఈ అనుభవం కొత్తగా ఉంది.

అందరూ ముసుగులు, కొంగులు, తువ్వాళ్ళు, బురఖాల మాటున బయటికి జారుకుంటున్నారు. ఇంక ఆలస్యం చేస్తే ఉన్న నలుగురూ వెళ్లిపోతారని ధైర్యం తెచ్చుకున్న ఓ టీవీ కుర్రాడు ఓ ముసలాయన్ని ఆపేశాడు.

''ఏమండీ... సినిమా ఎలా ఉంది? ఎందుకలా ముఖం చాటేస్తున్నారు... టీవీలో మీ మొహం స్క్రీనంతా కనిపించేటట్లు వేస్తాం. ప్లీజ్ ముసుగు తీసి కాస్త ఇటువైపు చూసి మాట్లాడండి'' మిగతా ఛానెళ్ళ వాళ్ళు కూడా మిగిలిన కొంతమందినీ ఆపేసి బ్రతిమిలాడుతున్నారు.

''బాబ్బాబు...మీకు పుణ్యం ఉంటుంది. మీ మొహాలు మా కెమేరాకి చూపించండి''

''కాళ్ళో... చేతులో ఏది కావాలంటే అది పట్టుకుంటాం''

''పోనీ...మీ కాళ్ళమీదే పడతాం''

''గడ్డం పట్టుకుంటాం...''

''సినిమా ఎలా ఉంది అంటే చెప్తాం. అంతేకానీ కెమేరా మా వైపు ఫోకస్ చేయడానికి వీల్లేదయ్యా'' ఒకాయన గట్టిగా అరిచాడు.

''ఎందుకండీ...మీ మొహం అప్పనంగా టీవీలో వస్తుంది కదా?''

''ఆఁ..వస్తుంది... వస్తుంది...మొన్న అలా వచ్చే మా ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయింది''

''ఏంటీ?!'' ఆశ్చర్యంగా నోరు మళ్ళీ వెళ్ళబెట్టాడు టీవీ యాంకర్.

''నేను మీటింగ్‌లో ఉన్నాను. ఇంటికి రావడానికి లేటవుతుందని చెప్పాను మా ఆవిడతో ఓ రోజు. ఇలాగే ఓ ఛానెల్‌వాళ్ళు ఆరోజు నన్నూ, నా సెక్రటరీనీ కలిపి టీవీలో చూపించేశారు 'పబ్లిక్ టాక్'లో. నా కొంప మునిగిపోయింది''

''ప్చ్...ప్చ్...''కొందరు సానుభూతి చూపించారు.

''మీటింగ్ అన్నది రైటేగా...'' మరికొందరు వ్యంగ్యంగా నవ్వుకున్నారు.

''పద డార్లింగ్... ఇక్కడ ఎక్కువసేపు ఉంటే ఇంకే తంటా వస్తుందో...''


ఆయన వయసులో సగం వయసు ఉన్న ఓ అమ్మాయి భుజం మీద చేతులేసి లాక్కుపోయింది.

''నువ్వు కాలేజీ కుర్రాడిలా ఉన్నావు. నువ్వయినా మా కెమేరాని కటాక్షించవయ్యా'' ఓ కుర్రాడిని బతిమాలాడాడు 'ఊ' టీవీ తాలూకు మనిషి.

''నో...నో...మొన్నోసారి ఇంట్లో ఎక్స్‌ట్రా క్లాస్ అని చెప్పి పిక్చర్ చూడ్డానికి వెళ్తే ఇలాగే ఒకడు నా మొహం మీద లైటేసి నా రహస్యం బట్టబయలుచేశాడు. మీ దిక్కుమాలిన టీవీ వాళ్ళ వల్ల రోడ్ల మీద తిరగడం కూడా కష్టమైపోతోంది'' ఎర్ర చొక్కా కుర్రాడు మొహం చూపించకుండానే దులిపేసి చక్కాపోయాడు.

''సార్... సార్... మీరు ఫ్యామిలీ... భార్యాభర్తలు...చిలకా గోరింకల్లా ఉన్నారు...మీరైనా...''

''చాలు..చాల్లేవయ్యా..జాయింట్



ఫ్యామిలీ...సరదాలు తీరక ఇంట్లో గుడికని చెప్పి అమధ్య సినిమాకొస్తే గుట్టు కాస్తా రట్టయింది'' ఆ జంట జాయింట్ ముసుగు కప్పుకుని పారిపోయారు.

''హుఁ...మొహం చాటెయ్యకుండా కెమేరాని ఫేస్ చెయ్యగలిగే ధీరులే కరువయ్యారా మన స్వర్ణాంధ్రప్రదేశ్‌లో'' టీవీల వాళ్ళు వాపోతున్నారు.

''లైలా..మజ్నూల్లా ఉన్నారు''

''వాహ్...క్యా జోడీహై''

''ప్లీజ్...ఓ చక్కటి ఫోజివ్వండి సార్... మిమ్మల్ని టీవీలో మెరిపిస్తాం'' 'ఓ' టీవీ కుర్రాడు కెమేరా వాళ్ళమీద ఫోకస్ చేశాడు.

''అయ్యబాబోయ్.. మమ్మల్ని వదలవయ్యా...హాల్లోంచి ఆఖరున రావడం పాపమైంది. నా ఫియాన్సీ మీ టీవీ చూస్తే కొంపమునిగిపోతుంది. ఇంట్లో నా బ్యాండ్ మోగిపోతుంది'' నల్లగళ్ళ తెల్లచొక్కా అబ్బాయి మొహానికి కర్చీఫ్ అడ్డు పెట్టుకున్నాడు.

''ఫట్...'' నల్ల గళ్ళ తెల్లచొక్కా అబ్బాయి కళ్ళు గిర్రున తిరిగాయి.

చెంప తడుముకుంటూ పక్కనున్న పసుపుపచ్చ చుడీదార్ సీతాకోకచిలుక వైపు అయోమయంగా చూశాడు.

''నీకు ఫియాన్సీ ఉంటే నేనెవర్ని? నా జీవితంలో మొట్టమొదటి ఆఖరి అమ్మాయివి నువ్వే అని ఇందాకేగా డైలాగ్ చెప్పావు'' మళ్లీ ఇంకోసారి రెండో దవడ వాయించేసి చరచరా వెళ్ళిపోయింది పసుపు రంగు చుడీదార్.

''ఇన్నేసి ఛానెళ్ళు వచ్చాక బొత్తిగా ప్రైవసీ లేకుండా పోయింది. కంగారులో వెధవది నిజం బయటికొచ్చేసింది'' తిట్టుకుంటూ పోయాడు నల్లగళ్ళ తెల్లచొక్కా కుర్రాడు టీవీ వాళ్ళని కొరకొరా చూస్తూ.

''ఒకళ్లంటే...ఒకళ్లనైనా పట్టలేమా...'' ఓ ఛానెల్ కుర్రాడు ఆఖరి ప్రయత్నంగా ఓ బురఖా దగ్గరికి పరిగెత్తాడు.

ఎలాగైనా ఒకరినైనా కెమేరాలో బంధించాలనుకుని గబగబా బురఖా పైకి ఎత్తాడు.

''సార్ పిక్చర్ ఎలా ఉంది?'' అంతే టపటపా రెండు దవడలూ వాయించింది నల్ల బురఖా శ్వేత సుందరి.

''బద్మాష్...మేరా భాయ్ ధేఖేగాతో తుమ్హే మార్ డాలేగా...'' బురఖా మగవాళ్ళే వేసుకుంటారన్న భ్రమలో ఉన్న యాంకర్‌కి గుర్తుకువచ్చింది బురఖా ఆడవాళ్ళు మాత్రమే వేసుకుంటారని.

''సారీ మేడమ్. సారీ బెహన్. మీరు మగవాళ్ళనుకుని...''

''ఏంటీ...నేను మగాడిలా ఉన్నానా?''

నల్లబురఖా శ్వేతసుందరి ఇంకోసారి రెండు దవడలూ వాయించింది.

అన్ని టీవీలవాళ్ళు ఒక్క చోటికి చేరారు నీరసంగా.

''పోనీ ఇంకో 'షో' అవగానే ట్రై చేద్దాం. మన లక్ ఎలా ఉంటుందో?''

''రోడ్లమీద గోతులున్నట్టు యాంకర్లుంటున్నారు. కాస్త చూసుకుని జాగ్రత్తపడాలి'' ఎవరో కామెంట్ చేసుకుంటూ వెళ్తున్నారు.

''ఇంకో మూడు గంటలు. ఫర్వాలేదు. వెయిట్ చేద్దాం'' ఒకళ్ళనొకళ్ళని ఓదార్చుకుంటున్నారు టీవీ వాళ్ళు.

''లోపలికి వెళ్ళినవారు బయటికి వచ్చి తీరతారు. మన చేతికి చిక్క తీరతారు..'' కులాసాగా పాడుకుంటూ లోపలకి వెళ్ళే జనప్రవాహం వైపు దృష్టిసారించి కుప్పలా కూలిపోయారు. ఎందుకంటే లోపలకి వెళ్ళే వాళ్లందరి చేతుల్లో ఉన్నాయి.. బురఖాలు..తువ్వాళ్ళు.. అంగవస్త్రాలు...మిగిలిన వాళ్ళకి ఒంటినంటే ఉన్నాయి కొంగులు...చున్నీలు.

''ఇంక మన గతి ఇంతే'' అన్నట్టు యాంకర్ల చేతులు తలలమీదకి చేరుకున్నాయి. ✤

**ఎం.నాగలక్ష్మి**